
## మరియా డొనిని



# ఏజెంట్ X

## యెదుల్ల సురేష్ రెడ్డి

సాయంత్రం నాలుగు గంటలు...

వేగంగా వచ్చి మెయిన్ రోడ్డుకు ఒక ప్రక్కగా ఆగిన టాక్సీలో నుండి వెంటనే క్రిందికి దిగకుండా లోపలే కూర్చుని కిటికీలో నుండి బయటకు చూసింది మరియా డొనిని.

రోమ్ పట్టణంలోని బిజీగా ఉండే ప్రాంతాల్లో ఒకటైన ఆ వీధి ఎప్పటి మాదిరిగానే జనంతో కిటకిటలాడి పోతోంది. అక్కడికి ఒక పక్కగా పెద్దపార్కు, దాని పక్కనే షాపింగ్ కాంప్లెక్స్ ఉన్నాయి. సాయంత్రం సమయం కావడం వలన షాపింగ్‌కు వచ్చినవాళ్ళు, పిల్లలతో షికారుకు బయలుదేరిన వాళ్ళు ఎక్కువగా కన్పిస్తున్నా రక్కడ. పార్కులో ఆడుకుంటున్న పిల్లల అరుపులు గోలగోలగా విన్పిస్తున్నాయి.

**టా**క్సీ డబ్బులు చెల్లించి నెమ్మదిగా క్రిందికి దిగిం దామె. హాండ్ బ్యాగ్‌లో నుండి నల్లటి కళ్లద్దాల్ని తీసి పెట్టుకుని వడివడిగా షాపింగ్ కాంప్లెక్స్ వైపు నడిచింది. ఆ కాంప్లెక్స్‌లో ఒక పక్కగా ఉంది టాయ్స్ ఎంపోరియమ్. వివిధ సైజుల్లో ఉన్న రకరకాల బొమ్మలు ఆ షాపు ముందు షోకేసుల్లో అందంగా అమర్చబడి అటువైపు వచ్చేవారిని వెంటనే ఆకర్షిస్తున్నాయి. నేరుగా ఆ టాయ్స్ షాపులోకి నడిచిం దామె.

అయిదు నిములపాటు మిగతా కస్టమర్లతో పాటు అక్కడ ఉన్న బొమ్మల్ని పరిశీలిస్తూ ఉండిపోయింది.

"చెప్పండి, మేడం, ఏం కావాలి...?" ఒక పక్కగా నిలబడి బొమ్మల్ని పరిశీలిస్తున్న ఆమె వద్దకు వచ్చి నమ్రతగా అడిగాడు సేల్స్‌మాన్.

"అలాంటి బొమ్మ ఒకటి కావాలి నాకు." షాపు బయట షోకేసులో ఉన్న ఒక బొమ్మను చూపిస్తూ చెప్పిం దామె.

"ఒక్క నిముషం, మేడం, ఇప్పుడే తెస్తాను" అంటూ లోపలికి వెళ్లి సరిగ్గా అలాంటి బొమ్మనే తీసుకొచ్చి ఇచ్చా డతను.

సంతృప్తిగా తల ఊపుతూ బిల్లు చెల్లించి బయటకు నడిచిం దామె. అదే కాంప్లెక్సులో ఉన్న రెస్టారెంట్‌లో కాఫీ తాగి, కొద్దిసేపు పార్కులో కూర్చుని ఆ తరువాత తీరిగ్గా తన హోటల్ గదికి చేరుకుంది. అప్పటివరకూ అతి సామాన్యంగా ప్రవర్తిస్తున్న ఆమెలో వెంటనే మార్పు వచ్చింది. గది తలుపుల్ని లోపలినుండి మూసివేసి గబగబా వెళ్లి మంచంపైన కూర్చుని చేతిలో ఉన్న కవర్లోంచి తను కొనుక్కువచ్చిన బొమ్మను బయటకు తీసింది. చూడగానే ముద్దొచ్చేలా ఉన్న టెడ్డీ బేర్ అది. బ్యాగులో నుండి చిన్న బ్లేడును తీసి ఆ బొమ్మ వెనుక భాగంలో నిలువుగా గాటుపెట్టి

రెండుగా విడదీసింది. లోపల ఉన్న స్పాంజి మధ్యలో భద్రంగా దాయబడి ఉన్నాయి కొన్ని కాగితాలు. వాటిని బయటకు తీసి ఆత్రుతగా విప్పి చూసిం దామె. ఒక్కో కాగితాన్ని చదివే కొద్దీ ఆమె మొహం ఆనందంతో వెలిగిపోసాగింది.

* * *

ఫ్రాన్స్ దేశంలోని నైస్ పట్టణం....

రెండంతస్తుల ఆ భవనంలోని ఒక గదిలో కూర్చుని మాట్లాడుకుంటున్న ఇద్దరు వ్యక్తులు ఉన్నట్టుండి ఆ గది తలుపు తెరుచుకోవడంతో మాటలు ఆపేసి చప్పున అటువైపు చూశారు. తలుపు తెరుచుకుని లోపలకి వచ్చింది మరియా. ఆమెను చూడగానే వారిద్దరూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

"చాలా సేపటి నుండి నీ కోసమే ఎదురు చూస్తున్నాం" అన్నాడు ఆ ఇద్దరిలో మధ్య వయస్కుడిగా ఉన్నతను. లెట్చియో జెల్లే అన్న పేరుగల అతను మరియా తండ్రి-ఫ్రాన్స్‌కుచెందిన ప్రాపగాండా - 2 అన్న ఆర్గనైజేషన్‌కు నాయకుడు.

అతని ఎదురుగా ఉన్న మరో వ్యక్తి సి.ఐ.ఏ. ఏజెంటు.

"ఏంటి విషయం...?" దగ్గరగా వెళ్లి వారి ప్రక్కనే కూర్చుంటూ అడిగింది మరియా.

"నువ్వు మరోపని చేసి పెట్టాలి మరియా. కేవలం నువ్వు మాత్రమే చేయగలవు ఈ పని.." అంటూ తన చేతిలో ఉన్న కొన్ని కాగితాల్ని ఆమెకు అందించాడు జెల్లే. "గ్వార్డియా డి ఫినాట్సా అన్న ఇటాలియన్ ఆర్గనైజేషన్‌కు చెందిన చాలా ముఖ్యమైన పత్రాలు ఇవి. ఇటలీలోని ఎంతోమంది ఉన్నత స్థాయి వ్యక్తులకు చెందిన రహస్యాలన్నీ ఈ కాగితాల్లో ఉన్నాయి. వాళ్ల అక్రమ ధనార్జన, దొంగచాటు వ్యవహారాలు, గ్వార్డియా డి ఫినాట్సా ఆర్గనైజేషన్ ద్వారా వాళ్లు సాగించిన లావాదేవీలు, వాళ్ల అడ్రసులు... అన్నీ వీటిలో ఉన్నాయి. నువ్వు వీటిని రోమ్‌లో ఉన్న మన ప్రతినిధులకు అందజేయాలి."

ఆమె అలాగే అన్నట్టుగా తల ఊపింది.

"చాలా జాగ్రత్తగా ఇదంతా జరగాలి" అన్నాడు- అప్పటివరకూ మౌనంగా వారి మాటల్ని వింటున్న సి.ఐ.ఏ. ఏజెంట్. "మన పథకంలో అతి ముఖ్యమైన పనుల్ని సాధించిపెట్టే పత్రాలు ఇవి. ఎట్టి పరిస్థితిలోనూ ఇవి మరొకరి కంట పడడానికి వీలులేదు. అదే జరిగితే మన పథకం మొత్తం సర్వనాశన మవుతుంది." హెచ్చరిస్తున్నట్టుగా అన్నా డతను.

"మీరేం వర్రీ అవకండి. మరొకరి కంట పడకుండా వీటిని ఎలా చేరవేయాలో నాకు బాగా తెలుసు." భరోసాగా అంది మరియా.

* * *

కమ్యూనిజం పట్ల విపరీతమైన ద్వేషాన్ని కలిగి ఉన్న పెట్టుబడీదారి దేశమైన అమెరికా వివిధ దేశాల్లోని కమ్యూనిస్టు ప్రభుత్వాల్ని కూల్చివేసే దిశలో చాలాకాలంగా తన ప్రయత్నాల్ని కొనసాగి స్తోంది. అందులో భాగంగానే అది ఇటలీ ప్రభుత్వాని కూల్చివేయడానికి పథకం వేసింది. ఇటలీలో గెరిల్లా పోరాటాల ద్వారా టెర్రరిజాన్ని ఎగద్రోయడం, ప్రతిపక్ష నాయకుల్ని కూడగట్టుకుని తిరుగుబాటుని లేవదీయడం ఈ పథకంలో భాగం. ఫ్రాన్స్ ఆర్గనైజేషన్ ప్రాపగాండా - 2 అధినేత లెట్చియో జెల్లేను సి.ఐ.ఏ. అందుకోసం ఉపయోగించుకుంది. ఇటలీలో జరిగిన ఎన్నో టెర్రరిస్టు కార్యకలాపాలకు విధ్వంసాలకు ప్రాపగాండా-2 ప్రత్యక్ష కారణం. ఆ విధంగా దేశంలో అలజడిని సృష్టించి ప్రభుత్వాన్ని కూలద్రోయడం వారి ఆశయం. లెట్చియో జెల్లే కూతురు మరియా డొనిని తన తండ్రికి కుడి భుజంగా వ్యవహరించేది. రహస్యపత్రాల్ని మరొకరి కంట పడకుండా చేతులు మార్చటంలో ఆమె ప్రతిభ అపారం.

అమెరికా సి.ఐ.ఏ. సహాయంతో ఇటలీ మాజీ డిఫెన్స్ మినిస్టర్ రాన్‌డాల్ఫ్‌ని ఇటలీ నియంతగా నియమించడానికి జెల్లే పథకం వేశాడు. ఇటలీ మిలటరీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఆమోస్ స్పియాట్సీ, ఇటలీ గూఢచార సంస్థ ఎస్.ఐ.డి. చీఫ్ జనరల్ మిచెల్లి కూడా ప్రాపగాండా - 2 సభ్యులు కావడం గమనార్హం. వీరందరూ సి.ఐ.ఏ. ఆదేశాలమేరకు తమ కార్యక్రమాల్ని కొనసాగించేవారు. గెరిల్లా పోరాటాల ద్వారా రోమ్‌లో విధ్వంసాల్ని సృష్టించి ప్రజల్లో భయాందోళనల్ని కలిగించాలన్న వారి పథకానికి తోడు ఇటలీ ఆర్గనైజేషన్ గ్వార్డియా డి ఫినాట్సా ద్వారా కొంతమంది ఇటలీ అధికారుల అక్రమాలకు సంబంధించిన రహస్య పత్రాలు జెల్లే సంపాదించగలిగాడు. ఆ పత్రాల ఆధారంగా ఇటలీ లోనూ, వాషింగ్టన్‌లోనూ, నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్)లోనూ ఉన్న ఇటలీ అధికారుల్ని లొంగదీసుకుని వారిని తమకు అనుకూలంగా మార్చుకోవడానికి వాళ్లు పథకం వేశారు. ఆ పథకంలో భాగంగానే ఆ పత్రాలు మరియా ద్వారా రోమ్‌లో ఉన్న జెల్లే సహచరులకు పంపించబడ్డాయి.

* * *

రోమ్‌లోని ఫుమిచినో ఎయిర్‌పోర్టు....

ఫ్రాన్స్ నుండి వచ్చిన విమానంలోంచి దిగిన ప్రయాణీకుల లగేజీని కస్టమ్స్ ఆఫీసర్లు రొటీన్‌గా చెక్ చేస్తున్నారు. మరియా లగేజీని పరిశీలిస్తున్న కస్టమ్స్ ఆఫీసర్‌కి ఎందుకో ఆమెపైన అనుమానం కలిగింది. ఆమె లగేజీని మొత్తం క్షుణ్ణంగా పరిశీ లించా డతను. మొదట ఏమీ దొరకలేదు కానీ చివరల్లో ఆమె హాండ్‌బ్యాగ్ కుట్టు మడతల్లో దాచి ఉంచబడిన రహస్య పత్రాలు బయటపడ్డాయి. ఆ మరుక్షణమే ఆమె అరెస్టు చేయబడింది.

ఇటలీ పోలీసు అధికారుల ఇంటరాగేషన్‌లో ఆమె నోటి నుండి మొత్తం రహస్యాలన్నీ బయట పడ్డాయి. ఆ వెంటనే ఇటలీ అధికారులు ఓలెస్టోలో ఉన్న జెల్లే భవనాన్ని చుట్టుముట్టి ఆమూలాగ్రం శోధించారు. ప్రాపగుండా-2 సభ్యులుగా ఉన్న ఇటలీ ప్రభుత్వాధికారులు, మిలటరీ అధికారులు, రాజకీయ నాయకులు, గూఢచార సంస్థల అధి పతులూ, నాటో అధికారులు, వ్యాపార వేత్తలు, పత్రికాధిపతులు, పార్లమెంటు మెంబర్లు, మంత్రులు, ఇంకా మరెంతో మంది ముఖ్యులైన వారి మాచారమంతా అక్కడ వారికి లభించాయి. జెల్లే మాత్రం వారికి దొరక్కుండా తప్పించుకున్నాడు. మరియా అరెస్టుతో జెల్లే ద్వారా ఇటలీలో టెర్రరిజాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలన్న అమెరికా ప్రయత్నాలకు గండిపడింది.

తండ్రికి సహకరిస్తూ ఇటలీలో ప్రభుత్వాన్ని కూలదోయడానికి తన వంతు ప్రయత్నాలు చేసిన మరియా మాత్రం చివరికి జైలు పాలయ్యింది. ●

